క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

జగిత్యాల: మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతీయువకులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమాధికారి చిత్రు అన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

జగిత్యాల: 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ బీసీ, ఓసీ, మైనార్టీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు చేసుకునేందుకు గడువు పొడిగించారని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు.

ఎస్పీని కలిసిన మెట్‌పల్లి సీఐ



ఎస్పీకి పూల మొక్క అందిస్తున్న సీఐ

జగిత్యాలక్రైం: మెట్‌పల్లి సీఐగా బాధ్యతలు స్వీకరించిన అనిల్‌కుమార్ గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందజేశారు.

కమిషనర్‌ను కలిసిన డిపో మేనేజర్



జగిత్యాల: మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన స్పందనను ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన కలిసి అభినందనలు తెలిపారు.

లీకేజీలకు తక్షణమే మరమ్మతు చేపట్టాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

మెట్‌పల్లి: పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే తక్షణమే మరమ్మతు చేపట్టాలని కమిషనర్ మోహన్ సూచించారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలో చేపడుతున్న మరమ్మతు పనులను గురువారం పరిశీలించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



సమావేశమైన అధికారులు

పెగడపల్లి: గ్రామాల సమగ్రాభివృద్ధికి పంచాయతీ యాక్షన్ ప్లాన్‌పై మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. సబ్‌కీ యోజన–సబ్‌కా వికాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలవారీగా చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఏఈఈలు శంషేర్‌అలీ, శ్రీమాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర పాల్గొన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి



ఒబులాపూర్‌లో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఎంపీడీవో

మల్లాపూర్: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి సూచించారు. గురువారం ఒబులాపూర్, తండా గ్రామాల్లో వన నర్సరీ, ఉపాధిహామీ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఏపీవో సతీశ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత



ప్రొసీడింగ్ పత్రం అందజేస్తున్న కృష్ణారావు

మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్: రామలచ్చక్కపేట గ్రామంలోని మాదిగ కుంట చెరువు పునరుద్ధరణ పనులకు సంబంధించిన నిధుల మంజూరు ప్రొసీడింగ్ పత్రాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు గురువారం గ్రామస్తులకు అందజేశారు. రూ.12.53లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు అంజిరెడ్డి, లింగం, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సురేశ్, మాజీ సర్పంచ్ కాసీం దిలీప్, భూమేశ్, షేక్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ అనుమతుల కోసం ఎదురుచూపులు



రంగపేట-రేచపల్లి గ్రామాల మధ్య నిలిచిన రోడ్డు నిర్మాణం

సారంగాపూర్: రంగపేట-రేచపల్లి గ్రామాల మధ్య నిలిచిపోయిన రోడ్డు నిర్మాణం పూర్తయితే పలు గ్రామాలకు చేరుకోవడానికి దూరాభారం తగ్గుతుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం అటవీ శాఖ అనుమతులు వస్తేనే పనులు పూర్తి చేయడానికి అవకాశం ఉంటుంది. రేచపల్లి-రంగపేట గ్రామాల మధ్య ఎస్‌ఆర్‌ఎస్‌పీ డీ–53 ప్రధాన కాలువతోపాటు 12–ఎల్ కాలువ వెంట తారు రోడ్డు నిర్మాణం చేపట్టి నాలుగు కిలోమీటర్ల రోడ్డును ప్రభుత్వం పూర్తి చేసింది. రంగపేట-రేచపల్లి గ్రామాల మధ్య ఎస్‌ఆర్‌ఎస్‌పీ డీ–53 ప్రధాన కాలువ సమీపంలో ఈ రహదారి 500 మీటర్ల రోడ్డు అటవీ శాఖ నర్సరీ–టేకు ప్లాంటేషన్ల మధ్య నుంచి వెళ్తుంది. రేచపల్లి నుంచి రంగపేట చేరుకోవడానికి 4 కిలోమీటర్ల తారు రోడ్డు పూర్తయింది. మరో 500 మీటర్ల రోడ్డు కంకర నిర్మాణం చేపట్టి వదలిపెట్టారు. రోడ్డు నిర్మాణం చేసే సమయంలో ఈ రోడ్డు పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉందని, దీనిపై తారు రోడ్డు నిర్మాణం జరిగితే కలప స్మగ్లర్లకు కలపను తరలించడానికి మరింత సులువవుతుందని అటవీ శాఖ అభ్యంతరం వ్యక్తం చేయడంతో 500 మీటర్ల రోడ్డు నిలిచిపోయింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రేచపల్లి, మ్యాడారంతండా, లచ్చనాయక్‌తండా, భీంరెడ్డిగూడెం గ్రామాల ప్రజలు రంగపేట మీదుగా రాయికల్ మండలం చేరుకోవడానికి 10 కిలోమీటర్ల దూరాభారం తగ్గుతుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. 15 సంవత్సరాల క్రితం చేపట్టిన ఈ రోడ్డు పూర్తిగా అటవీ శాఖ పరిధిలోకి రావడంతో అటవీ శాఖ అధికారులు రోడ్డు నిర్మాణం కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులిచ్చే ప్రసక్తి లేదని పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు అటవీ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చంద్రయాన్ శాటిలైట్‌లో పాల్గొనడం అదృష్టం



రాజేందర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రాయికల్: చంద్రయాన్ శాటిలైట్ ప్రాజెక్టులో పాల్గొనడం తన అదృష్టమని సైంటిస్ట్ రాజేందర్ అన్నారు. గురువారం పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధిస్తారని, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజేందర్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ మచ్చ గంగాధర్, డైరెక్టర్ మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు మహేశ్, రంజిత్, రజిత, సంజన, హిందూజ పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు



ఇబ్రహీంపట్నం: ఎర్దండి గ్రామ శివారులోని మల్లికార్జున, గంగామాత దేవాలయ హుండీని గురువారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.28,258 వచ్చినట్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా డివిజన్ పరిశీలకుడు రాజమౌళి తెలిపారు. కార్యనిర్వహణ అధికారి విక్రమ్, ఆలయ అర్చకుడు ఓంకార్‌శర్మ, గుంటుక శివకేశవ్, రాజేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ హుండీని గురువారం సిబ్బంది లెక్కించారు. రూ.2,61,220 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రాజ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: రైతులు ఆయిల్‌పామ్ పంటపై ఆసక్తి చూపాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ సూచించారు. గురువారం యామాపూర్, ఫకీర్‌కొండాపూర్ గ్రామాల్లో ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ పంట సాగుతో ప్రభుత్వం అందిస్తున్న రాయితీ, దిగుబడి, సాగులో ఇతర పంటలతో పోలిస్తే వచ్చే లాభాలపై వివరించారు. ఏఈవో సాగర్, కంపెనీ ప్రతినిధి అక్షయ్ పాల్గొన్నారు.

ఆరు గంటలపాటు 108 ప్రదక్షిణలు



మహిళను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

జగిత్యాలరూరల్: ఆరు గంటలపాటు దేవాలయంలో 108 ప్రదక్షిణలు చేసి మహిళ తన భక్తిని చాటుకున్నారు. లక్సెట్టిపేటకు చెందిన అప్పని శ్రీలత గురువారం పొలాస గ్రామ శివారులోని సహస్ర లింగాల దేవాలయంలో ఆరు గంటలపాటు 108 ప్రదక్షిణలు చేశారు. ఆలయ చైర్మన్ నలమాసు గంగాధర్ శేష వస్త్రంతో ఘనంగా సన్మానించారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కథలాపూర్: సిరికొండ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. 120 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 50 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు సంజీవ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, పరమేశ్వర్, కిషన్‌రెడ్డి, సతీశ్, రవి, లింబాద్రి, మక్దుమ్ పాషా పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన మాసూరి శ్రీనివాస్–అజిత దంపతులు, వారి కుమారుడు ప్రణీత్ విరాళంగా రూ.10,116 నగదుతోపాటు పంచలోహ కుదురు, రోకలిని గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

వ్యక్తిపై కేసు

కథలాపూర్: కోరుట్ల మండలం నాగులపేట గ్రామానికి చెందిన సంగ సతీశ్ అనే ఇసుక ట్రాక్టర్ యజమాని అధికారులతో దురుసుగా ప్రవర్తించినందుకు కేసు నమోదు చేసినట్లు కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ గురువారం తెలిపారు. కథలాపూర్ మండలం సిరికొండ శివారులోని వాగులో రెవెన్యూ, పోలీసులు సిబ్బంది గురువారం తనిఖీలు చేపట్టగా.. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ కనిపించిందన్నారు. ఆ ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించగా.. ట్రాక్టర్ యజమాని సతీశ్ అధికారులతో దురుసుగా ప్రవర్తించారని అన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నగేశ్ ఫిర్యాదు మేరకు సతీశ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

మేడిపల్లి: కల్వకోట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.32వేలు, ఆరు ఫోన్లు స్వాధీనపరచుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీసీఎస్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు

జగిత్యాల: ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలున్నాయని, జిల్లాలోని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని, ఈనెల 29న జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ అధికారి సత్తమ్మ తెలిపారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

- మహిళా రైతులకే వర్తింపు
- నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

కేటాయించిన వ్యవసాయ పరికరాలు
బ్యాటరీ స్ప్రేయర్స్: 08
పవర్ ఆపరేటర్ స్ప్రేయర్స్: 08
రోటవేటర్స్: 04
కల్టివేటర్స్: 05



మల్లాపూర్ వ్యవసాయ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో లావణ్య(ఫైల్)

మల్లాపూర్: ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ ఉప ప్రణాళిక పథకం కింద మహిళా రైతులకు వ్యవసాయ సామగ్రి ఇవ్వనుంది. మండలాలవారీగా వివిధ రకాల పరికరాలనిచ్చేందుకు నిధులు మంజూరయ్యాయి. ఇటీవల వ్యవసాయ పరికరాలు అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024–25లోనే ఈ పథకాన్ని అమలు చేయాలని ఆదేశాలిచ్చారు. ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తులు తీసుకోవడంతోపాటు లబ్ధిదారుల ఎంపిక చేయాల్సి ఉంటుంది. లబ్ధిదారుల నుంచి సంబంధిత కంపెనీలకు డీడీలు కట్టించి సామగ్రిని పంపిణీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం మహిళా రైతులకే వీటిని ఇవ్వాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మూడు రోజుల గడువు మాత్రమే ఉంది. సమయం తక్కువగా ఉండటంతో వ్యవసాయాధికారులు కసరత్తు చేస్తున్నారు. మండలంలో దరఖాస్తుల స్వీకరణకు శుక్రవారంతో గడువు ముగియనుంది. వ్యవసాయంలో ఉపయోగపడే పరికరాలకు మాత్రమే ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు.

మహిళా రైతులే అర్హులు

ఈ పథకానికి కేవలం మహిళా రైతులు మాత్రమే అర్హులని ప్రభుత్వం పేర్కొంది. రాయితీ పొందేందుకు మహిళల పేరు మీద భూమి నమోదై ఉండాలి. దరఖాస్తు కోసం మహిళా రైతు పట్టా పాసుబుక్, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్సీ(భాగస్వామి/రైతు ట్రాక్టర్‌తో లాగబడే పనిముట్లకు మాత్రమే), సాయిల్ హెల్త్‌కార్డ్ తప్పనిసరని అధికారులు పేర్కొంటున్నారు. చిన్న, సన్నకారు మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, మిగతా మహిళా రైతులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్న మహిళా రైతులు దరఖాస్తులను ఆయా క్లస్టర్లలోని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి లేదా వ్యవసాయ అధికారికివ్వాలని ఏవో లావణ్య తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి



రాయితీపై అందించనున్న వ్యవసాయ పరికరాలను మహిళా రైతులు సద్వినియోగం చేసుకోవాలి. మండలానికి బ్యాటరీ స్ప్రేయర్స్, పవర్ ఆపరేటర్ స్ప్రేయర్స్, రోటవేటర్స్, కల్టివేటర్స్ పనిముట్లను కేటాయించారు. దరఖాస్తుల గడువు శుక్రవారంతో ముగియనుంది. – లావణ్య, మండల వ్యవసాయ అధికారి, మల్లాపూర్

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: నియోజకవర్గ పరిధిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగిత్యాల నియోజకవర్గ పరిధిలో దాదాపు 6వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటలు పండించారని, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



తడిసిన ధాన్యం చూపిస్తున్న నాయకులు, రైతులు

మెట్‌పల్లిరూరల్: అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్ అన్నారు. మెట్లచిట్టాపూర్, రంగారావుపేట, ఏఎస్‌ఆర్‌తండా గ్రామాల్లో గురువారం రైతులను కలిశారు. తడిసిన ధాన్యం పరిశీలించారు. నాయకులు రాజగణేశ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఏవోకు వినతి



జగిత్యాల: ఇటీవల జిల్లాలో కురిసిన అకాల వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని, వారిని ఆదుకోవాలని ముఖ్యమంత్రికి లేఖ రాస్తూ కలెక్టరేట్ ఏవో హకీంకు బీసీ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. లక్ష్మీనారాయణ, కొక్కు గంగాధర్, రాంచంద్రం, రోజా, గంగారాం, వంశీ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు



పెగడపల్లి: అరెస్టయిన మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు

పెగడపల్లి: మండలంలోని బీఆర్ఎస్‌కు చెందిన మాజీ సర్పంచులు, నాయకులను స్థానిక పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేశారు. మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లుల విషయంపై అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లకుండా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలేశారు.

జగిత్యాలరూరల్: అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచులు పిలుపునివ్వగా.. పోలీసులు మండలానికి చెందిన మాజీ సర్పంచులను అరెస్ట్ చేశారు. చెరుకు జాన్, ఏళ్ల గంగనర్సు, బుర్ర ప్రవీణ్, జక్కుల తిరుపతి పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మల్లాపూర్: మాజీ సర్పంచులను రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో ముందస్తు అరెస్టు చేయించడం గర్హనీయమని మాజీ సర్పంచులు నాగరాజు, భూక్య గోవింద్‌నాయక్, సయ్యద్ హైదర్ అన్నారు. మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పంట రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో చైర్మన్‌కు సన్మానం

ధర్మపురి: సహకార సంఘాల ద్వారా అందిస్తున్న పంట రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి స్థానిక వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చిలుముల లావణ్యతోపాటు డైరెక్టర్లు హాజరయ్యారు. సంఘంలోని జమ ఖర్చులు, రైతులకు పంట రుణాలు, రబీలో వరి కొనుగోళ్లపై చర్చించారు. చైర్మన్‌ను సన్మానించారు. సంఘం ఉపాధ్యక్షుడు శేర్ల రాజేశం, డైరెక్టర్లు ఎల్లాగౌడ్, లింగన్న, జాజాల లక్ష్మి, సీఈవో రాజేశ్, రైతులు తదితరులున్నారు.

డీఎన్‌టీ సర్టిఫికెట్ జారీ చేయాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

మల్యాల: రాష్ట్రంలోని పూసాల కులస్తులకు డీనోటిఫైడ్ ట్రైబల్ కులస్తుల సర్టిఫికెట్ జారీ చేయాలని పూసాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. భారత సామాజిక, న్యాయ సాధికారికత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సంచార జాతాలు జాబితాలోని 37 కులాలకు డీఎన్‌టీ సర్టిఫికెట్ జారీ చేయాలని ఆదేశాలు జారీ చేసినా.. తెలంగాణ ప్రభుత్వం డీఎన్‌టీ సర్టిఫికెట్ జారీ చేయడం లేదని కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ముద్దినేని మురళి, కోనేటి సాగర్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: విద్యార్థుల నృత్యం



కథలాపూర్: విద్యార్థినుల నృత్యం

పాఠశాలల వార్షికోత్సవం

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆటపాటలతో పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజన్న, డబ్బా, అమ్మక్కపేట, కొమటికొండాపూర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంబారిపేటలో..

కథలాపూర్: అంబారిపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షిక వేడుకలు గురువారం రాత్రి నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 2002–03 విద్యాసంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ.20వేల ప్రింటర్‌ను పాఠశాలకు విరాళంగా అందించారు.

వైభవంగా సాయినామ సప్తాహం



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని వైభవంగా సాయినామ సప్తాహం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సతీశ్‌కుమార్, కిషన్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు సమావేశం

జగిత్యాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలను ఏప్రిల్‌లో నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈనెల 28న కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు, దళిత సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరై సలహాలివ్వాలన్నారు.